సాక్షి
రాజన్న సిరిసిల్ల
గురువారం । 28 । సెప్టెంబర్ । 2023

గంభీరావుపేటను మున్సిపాలిటీ చేస్తా

- ఎగువమానేరు వద్ద రెండు హై లెవల్ వంతెనలు
- ఇక నిండు కుండలా ఎగువమానేరు
- జిల్లాలో మొదటి విడతగా 1,967 మందికి గృహలక్ష్మి
- ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్


గంభీరావుపేటలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేటను మున్సిపాలిటీగా మారుస్తానని ఐటీ, పురపాలకశాఖ మంత్రి కే.తారకరామారావు అన్నారు. గంభీరావుపేట మండలంలో బుధవారం పర్యటించారు. పలు గ్రామాల్లో లబ్ధిదారులకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లపట్టాలు పంపిణీ చేశారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తొమ్మిదేళ్లలో గంభీరావుపేటను ఎంతగానో అభివృద్ధి చేశామని అన్నారు. రాష్ట్రంలోనే ప్రప్రథమంగా ఇక్కడే కేజీ టు పీజీ విద్యాసంస్థలు నెలకొల్పడం జరిగిందని తెలిపారు. మరికొద్ది రోజుల్లోనే రూ. 30కోట్లతో ఫోర్‌లైన్ రోడ్లు, సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ, రూ.3కోట్లతో సమీకృత వ్యవసాయ మార్కెట్, రూ.13.40కోట్లతో మానేరువాగుపై హైలెవల్ వంతెన నిర్మిస్తామని, నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు వద్ద సిద్దిపేట, కామారెడ్డి ప్రధాన రహదారిపై రెండు చోట్ల హైలెవల్ వంతెనలు నిర్మిస్తామని, వచ్చే వానాకాలం నాటికి వంతెనలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టును నీటితో నింపాలని హైదరాబాద్‌కు పాదయాత్రలు చేసిన రోజు లను గుర్తు చేశారు. కూడవెల్లి నుంచే కాకుండా కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్యాకేజీ–9 ద్వారా వచ్చే నీళ్లతో ప్రాజెక్టు ఎన్నటికీ జలకళతోనే ఉండేలా త యారైందన్నారు. జిల్లాలో 640 గుడిసెలు, 432 రేకుల షెడ్లు, 907 శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసిస్తున్న వారికి మొత్తంగా 1,967 మందికి మొదటి ప్రాధాన్యతగా గృహలక్ష్మి పథకం వర్తింపజేస్తామన్నారు.

ప్రారంభోత్సవాలు.. శంకుస్థాపనలు

గంభీరావుపేటతో పాటు లింగన్నపేట, నర్మాల, కోళ్లమద్ది గ్రామాల్లో నిర్మించిన 303 డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయాలను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. పలువురు లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వులు అందజేశారు. గంభీరావుపేటలో రూ.30కోట్లతో నిర్మించతలపెట్టిన ఫోర్‌లైన్ రోడ్డు పనులకు, వంతెన నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. లింగన్నపేట, కొత్తపల్లి జీపీ భవనాలను ప్రారంభించారు. కొత్తపల్లిలో రూ.5కోట్లతో చేపట్టనున్న డబుల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా రూ. 38లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. సర్పంచులు కటకం శ్రీధర్‌పంతులు, ఎడబోయిన రాజు, అక్కపల్లి స్వరూప, కేశవరావు, చైతన్య, ఎంపీటీసీలు భాగ్య, రేణుక, బాలమణి, టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, కలెక్టర్ అనురాగ్ జయంతి, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, అడిషనల్ కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఆర్డీవో ఆనంద్‌కుమార్, ప్రత్యేక అడిషనల్ కలెక్టర్ గంగయ్య, ఎంపీపీ వంగ కరుణ, జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, ఆర్‌బీఎస్ జిల్లా అధ్యక్షులు గడ్డం నర్సయ్య, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, రాష్ట్ర బ్రహ్మణ పరిషత్ సభ్యురాలు సుమలత శర్మ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు తదితరులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్ రూం ఇళ్ల కోసం ఆందోళన

డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం ఎంపికైన లబ్ధిదారులందరికీ అధికారులు మంజూరుపత్రాలు ఇవ్వడానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. కానీ అందరికీ ఉత్తర్వులు ఇవ్వకుండానే ఆపేశారు. దీంతో ఇళ్లు మంజూరైనవారు తమకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. వర్షం కారణంగా ఎంపికైన లబ్ధిదారులందరికీ మంజూరు ఉత్తర్వులు అందించలేకపోయామని, గురువారం ఉదయం తహసీల్దార్ కార్యాలయంలో పంపిణీ చేస్తామని తహశీల్దార్ భూపతి తెలిపారు.

ఆత్మీయ పలకరింపులు

మంత్రి కేటీఆర్ తన పర్యటనలో ఆత్మీయంగా పలుకరిస్తూ ముందుకు సాగారు. మండలకేంద్రంలో స్వామి అనే లబ్ధిదారుని ఇంట్లోకి వెళ్లి వారితో మాట్లాడారు. స్వామి తాను క్లాస్‌మేంట్లుగా తెలిపాడు. బరిగెలగూడెం కాలనీలో చిన్నారులతో కేటీఆర్ ఇంగ్లీషులో మాట్లాడారు. బీఆర్‌ఎస్ యువ నాయకుడు ఇరిగి సందీప్ దంపతులను కేటీఆర్ ఆశీర్వదించారు.


సభకు హాజరైన ప్రజలు


ఇంటి పత్రాలు అందిస్తున్న మంత్రి కేటీఆర్


గృహప్రవేశంలో పాల్గొన్న మంత్రి కేటీఆర్



వెళ్లిరా.. వినాయక

వేములవాడ: నవరాత్రులు ఘనమైన పూజలు అందుకున్న పార్వతీ తనయుడు బుధవారం గంగమ్మ ఒడికి చేరాడు. డప్పుచప్పుళ్లు.. కోలాటాలు.. నృత్యాలు.. ఆటపాటల నడుమ గణేశుడి శోభాయాత్ర కన్నుల పండువగా సాగింది. వేములవాడ నియోజకవర్గంలోని అన్ని మండలాలతో పాటు సిరిసిల్లలోని పలు ప్రాంతాల్లో నిమజ్జనం నిర్వహించారు. టెంపుల్‌సిటీ వేములవాడ రాజన్న సన్నిధిలో వేడుక అంబరాన్నంటింది. గణనాథుడిని పురవీధులు గుండా ఊరేగించి గుడిచెరువులో నిమజ్జనం చేశారు. మధ్యాహ్నం వర్షం కాస్త నిరుత్సాహపరచగా.. సాయంత్రం తెరుపునిచ్చింది. దీంతో పట్టణవాసులు నృత్యాలు, భక్తిగీతాలు, భజనల మధ్య స్వామివారిని తరలించారు. అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ సీఐ కరుణాకర్‌లు బందోబస్తును, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కమిషనర్ అన్వేశ్, మేనేజర్ సంపత్‌రెడ్డి, ఏఈ నర్సింహస్వామి, డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


వేములవాడలో గణపయ్యతో చిన్నారి


స్కూటీపై నిమజ్జనానికి బయల్దేరిన గణేశుడు


బోయినపల్లిలో వినాయకుడి నిమజ్జనం


గుడిచెరువు వద్ద అధికారుల పర్యవేక్షణ


వేములవాడలో గణనాథుడి శోభాయాత్ర


రుద్రంగిలో వినాయకుడితో చిన్నారులు


ఎల్లారెడ్డిపేటలో..


రాజన్న ఆలయం వద్ద గణేశుడి శోభాయాత్ర


నిమజ్జన కార్యక్రమంలో వేములవాడ ప్రముఖులు

న్యూస్‌రీల్

మూడు రోజులు మద్యం దుకాణాలు బంద్


మాట్లాడుతున్న సీఐ చంద్రశేఖర్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని గంభీరావుపేట, ముస్తాబాద్, కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాల్లో ఈనెల 27 ఉదయం నుంచి 29వ తేదీ వరకు మద్యం దుకాణాలు మూసివేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్ తెలిపారు . స్థానిక సర్కిల్ కార్యాలయంలో బుధవారం సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ నాలుగు మండలాల్లోని వైన్స్‌లు, బార్లు మూసివేయాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకోవడమే కాకుండా, వారి లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. అదే విధంగా గ్రామాల్లోని బెల్ట్‌షాపుల్లో మద్యం విక్రయిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గిరిజన గురుకులాల్లో అధ్యాపక పోస్టులు

సిరిసిల్లకల్చరల్: తంగళ్లపల్లిలోని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీ కోసం అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రజిని ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, జువాలజీ, ఫిజిక్స్, కంప్యూటర్‌సైన్స్, కామర్స్ సబ్జెక్టుల్లో పీజీ కనీస అర్హతతో పాటు నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హత లున్న మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. పార్ట్‌టైమ్ ప్రాతిపదికన భర్తీ చేసే ఈ పోస్టులకు ఆసక్తి గల వారు విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 30న ఉదయం 11 గంటలకు నేరుగా కళాశాలలో హాజరు కావాలని సూచించారు.

ఓపెన్‌స్కూల్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లఎడ్యుకేషన్: ఆగిన చదువులు కొనసాగించడానికి తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీలో ప్రవేశాలు తీసుకునేందుకు ఈ నెల 30 వరకు అవకాశం ఉన్నట్లు జిల్లా విద్యాధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను నమోదు చేసి ఆ ధ్రువీకరణ పత్రాలను సంబంధిత ఓపెన్ స్కూల్ కేంద్రంలోని అందించాలని తెలిపారు.

కొండా లక్ష్మణ్ ఆశయ స్ఫూర్తి కొనసాగాలి

- నివాళి అర్పించిన నేతలు, అధికారులు


బాపూజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, చైర్‌పర్సన్లు అరుణ, కళ

సిరిసిల్లకల్చరల్: స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ స్ఫూర్తిని కొనసాగించాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. బుధవారం ఎల్లమ్మ జంక్షన్‌లో మున్సిపల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాపూజీ జయంతికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉద్యమకారుడిగా ప్రజాస్వామిక వాదిగా నిబద్ధత కల రాజకీయవేత్తగా బాపూజీ జీవితం మరోతరానికి సైతం ఆదర్శంగా నిలుస్తుందన్నారు. అంతకుముందు కలెక్టర్ అనురాగ్ జయంతి బాపూజీకి నివాళి అర్పించారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, రైతుబంధు సమన్వయ సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు ఆకునూరి శంకరయ్య, బీఆర్‌ఎస్ జిల్లా, పట్టణాధ్యక్షులు తోట ఆగయ్య, జిందం చక్రపాణి పాల్గొన్నారు.

కళాకారులకు సత్కారాలు

బాపూజీ జయంతి వేడుకల్లో చేనేత శిల్పి వెల్ది హరిప్రసాద్, నేత కార్మికులు కుడిక్యాల లింగయ్య, ఒడ్నాల కృష్ణహరి, సందుపట్ల మైసయ్య, ఒడ్నాల దేవవ్వను శాలువా, జ్ఞాపికతో సన్మానించారు.

సభలో రసాభాస

కార్యక్రమం కొనసాగుతున్న క్రమంలో రసాభాస జరిగింది. బీఆర్‌ఎస్ సీనియర్ కార్యకర్త మేర్గు లక్ష్మణ్ మాట్లాడుతూ పార్టీలో సీనియర్ కార్యకర్తలకు తగిన గుర్తింపు లభించడం లేదన్నారు. పార్టీ కార్యక్రమం కాదని, సందర్భోచితంగా మాట్లాడాలని సూచించినప్పటికీ లక్ష్మణ్ అలాగే తన వాదన వినిపించడంతో బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు సీరియస్ అయ్యారు. స్థానిక నేతలు సర్దిచెప్పడం గొడవ సద్దుమణిగింది.

పోటాపోటీగా వేడుకలు

కొండా లక్ష్మణ్ జయంతి వేడుకలు పోటాపోటీగా నిర్వహించారు. ఓ వైపు ఎల్లమ్మ జంక్షన్‌లో మున్సిపల్ ఆధ్వర్యంలో అధికారిక ఉత్సవాలు నిర్వహిస్తూ ఉండగా పట్టణ పద్మశాలీలు బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేశారు. బీజేపీ నేతలు బైక్ ర్యాలీ నిర్వహించారు. లగిశెట్టి శ్రీనివాస్, కౌన్సిలర్ గూడూరి భాస్కర్, గాజుల వేణు అన్నల్‌దాస్ వేణు తదితరులు నినాదాలు చేస్తూ విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడే ప్రసంగాలు కొనసాగించడంతో సభాస్థలిలో కొంతమేర అంతరాయం ఏర్పడింది.


మహా నైవేద్యంతో పట్టణ మహిళలు


విద్యుత్ దీపాలతో గణనాథుడి మండపం

నేత్రపర్వంగా గణపతి రోషన్లు

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల పట్టణంలో వినాయక రోషన్లు ఆకట్టుకున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో చివరిరోజైన బుధవారం వినాయక మండపాల నిర్వాహకులు రోషన్లు జరిపారు. అన్ని వినాయక మండపాల్లో బొమ్మల కొలువులతో ప్రత్యేకంగా అలంకరణలు చేశారు. విద్యుత్ దీపాలు, భారీ సెట్టింగులతో ప్రత్యేకంగా అలంకరించారు. దాండియా ఆటలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. వినాయక రోషన్లను చూడటానికి వేలాది సంఖ్యలో రావడంతో బుధవారం రాత్రి కార్మికక్షేత్రంలో పండుగ వాతావరణం నెలకొంది. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి పాల్గొన్నారు.

సిరిసిల్లలో నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

- శోభాయాత్రలో డీజేలు వినియోగిస్తే కేసులే..
- ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరిక

సిరిసిల్లక్రైం: జిల్లాకేంద్రంలో నేడు నిర్వహించే గణేశ్ నిమజ్జనానికి మానేరువాగు తీరంలో ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. నిమజ్జన ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. క్రేన్లు, ఫ్లడ్‌లైట్లు, బారికేడ్లతో పాటు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచామని అన్నారు. శోభాయాత్రలో డీజేలకు అనుమతి లేదని, వినియోగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విగ్రహాలను తీసుకొచ్చే వాహనాల డ్రైవర్లు మద్యం సేవించొద్దని సూచించారు. క్రమపద్ధతిని పాటించాలని, రోడ్లపై ట్రాఫిక్‌జాం కాకుండా సహకరించాలని అన్నారు. నిమజ్జనం సందర్భంగా నేడు జిల్లాకేంద్రంలో ట్రాఫిక్ డైవర్షన్లు ఉంటాయని సూచించారు. చిన్నపిల్లలు నీటిలోకి వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. మండపాల నిర్వాహకులు సమయపాలన పాటిస్తూ నిమజ్జనానికి తరలాలని సూచించారు. అన్నిశాఖల సమన్వయంతో శోభాయాత్ర, నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా చూడాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వినాయక కమిటీ సభ్యులు, సిరిసిల్ల ప్రజలు సహకరించాలని అన్నారు. ఎస్పీ వెంట టౌన్ సీఐ ఉపేందర్, టౌన్ ప్లానింగ్ అధికారి అన్సారీ ఉన్నారు.


రాజన్న ఆలయంలో కోడెమొక్కు చెల్లిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

బాపూజీ సేవలు చిరస్మరణీయం

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో లక్ష్మణ్‌బాపూజీ జయంతి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

రాజన్నను దర్శించుకున్న ఎస్పీ దంపతులు

వేములవాడ: వేములవాడ రాజన్నను ఎస్పీ అఖిల్ మహాజన్ దంపతులు బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శన అవకాశం కల్పించారు. వేదోక్త ఆశీర్వచనం గావించారు. ఆలయ ఉద్యోగుల సంఘం నాయకులు సిరిగిరి శ్రీరాములు, ఉపాధ్యాయుల చంద్రశేఖర్ ఘనంగా సన్మానించారు.

క్లుప్తంగా

గుడుంబా పట్టివేత


పట్టుకున్న గుడుంబాతో ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లిలో గుడుంబాను తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. నిమ్మపల్లి–కోనరావుపేట మధ్య మంగళవారం రాత్రి ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. వీర్నపెల్లి మండలం గర్జనపల్లిలోని పాతచెరువుతండాకు చెందిన బానోత్‌నరేశ్‌కు చెందిన వాహనాన్ని తనిఖీ చేయగా 30సారా పాకెట్లు లభ్యమయ్యాయి. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

కారు, బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు


ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన వాహనాలు

సిరిసిల్లక్రైం: వేములవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు చంద్రంపేట పెట్రోలబంకు నుంచి బయటకు వెళ్తున్న బైక్, ఆగిఉన్న కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. ద్విచక్రవాహనంపై ఉన్న కమటం ప్రసాద్, భారతి గాయపడ్డారు. వీరిద్దరిని సిరిసిల్లలోని ఆసుపత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతున్నారు. ఆర్టీసీ బస్సు అధిక స్పీడ్‌లో ఉందని, అదే సమయంలో బైక్ డివైడర్ నుంచి రావడంతో బస్సు డ్రైవర్ బ్రేక్ వేసినా అదుపుకాలేదని, దీంతో ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శిగా సత్యం


నాలిక సత్యం

కోనరావుపేట: జాతీయ మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా నాలిక సత్యంను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు పల్లి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కోనరావుపేట మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన సత్యం చేస్తున్న కృషిని గుర్తించి రాష్ట్ర బాధ్యతలు అందించామన్నారు. తన ఎన్నికకు సహకరించిన జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్, జిల్లా అధ్యక్షుడు రొడ్డ రామచంద్రం తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

గోల్డ్‌స్మిత్ ఇంట్లో ఏసీబీ అధికారుల సోదాలు


పురుషోత్తమాచారి ఇంటి వద్ద ఏసీబీ అధికారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఓ గోల్డ్‌స్మిత్ ఇంట్లో అవినీతి నిరోధకశాఖ అధికారులు బుధవారం రాత్రి సోదాలు నిర్వహించారు. ఎల్లారెడ్డిపేటకు చెందిన చెన్నోజు పురుషోత్తమాచారి ఇంట్లో సిద్దిపేట జిల్లాకు చెందిన ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు. పురుషోత్తమచారి బంగారు నగల తయారీ వృత్తిలో కొనసాగుతున్నాడు. స్థానికంగా ఉన్న సిరిసిల్ల అర్బన్‌బ్యాంక్‌లో బంగారు అప్రైజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బంగారం విషయంలో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించడానికి వచ్చిన సమయంలో సదరువ్యక్తి సొంతపనులపై మరోప్రాంతానికి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తనిఖీలు చేసిన అధికారులు కొంత బంగారంతో పాటు అందుకు సంబంధించిన పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

ఖాకీ ఇంటికి కన్నం

- దొంగను అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట సర్కిల్ పరిధిలోని ఓ పోలీస్ స్టేషన్‌ల విధులు నిర్వర్తిస్తున్న ఎస్సై ఇంట్లో బుధవారం దొంగతనం జరిగింది. సదరు ఎస్సై గంభీరావుపేటలో మంత్రి కేటీఆర్ పర్యటనలో భాగంగా విధుల నిర్వహణకు వెళ్లాడు. ఇంట్లో ఎవరు లేని సమయాన్ని అసరాగా చేసుకున్న దొంగ ఈ చోరీకి పాల్పడినట్లు తెలిసింది. విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన ఎస్సై తన ఇంట్లో చోరి జరిగి నగదు అపహరణకు గురైనట్లు గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఇంట్లో పని చేసే వ్యక్తి ఈ చోరికి పాల్పడినట్లు తెలిసింది. అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.


చిత్రంలో కనిపిస్తున్న ఈమె లోకుర్తి లక్ష్మి. వీర్నపల్లి గ్రామం. వీరి కుటుంబంలో నలుగురు ప్రస్తుతం జ్వరంతో బాధపడుతున్నారు. పెద్ద దవాఖానాకు వెళ్లలేక గ్రామంలోని ఆర్ఎంపీ వద్ద వైద్యం చేయించుకుంటున్నారు. ఇప్పటివరకు రూ.5వేలు ఖర్చయ్యాయని, అయినా జ్వరం తగ్గలేదని చెబుతున్నారు. మండలకేంద్రంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


చిత్రంలో నీరసంగా కనిపిస్తున్న వ్యక్తి పేరు ఎడల్లి నితిన్. మండలంలోని బంజేరు గ్రామం. ఇంటర్ వరకు చదివి, కూలీపని చేసుకుంటూ తండ్రికి చేదోడుగా ఉంటున్నాడు. ప్రస్తుతం కుటుంబంలోని అందరూ జ్వరంతో బాధపడుతున్నారు. వీర్నపల్లిలోని ఆర్ఎంపీ వద్ద చికిత్స పొందుతున్నారు. ఇతనితో పాటు తండ్రి బాబు, తల్లి బాబాయి, నాయనమ్మ లచ్చవ్వ జ్వరంతో బాధపడుతున్నారు.

వీర్నపల్లికి జ్వరమొచ్చింది

- ప్రతీగ్రామంలో జ్వర బాధితులు
- వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లలేక ఇబ్బందులు


సెలైన్ ఎక్కించుకుంటున్న జ్వర పీడితుడు

వీర్నపల్లి: వీర్నపల్లికి జ్వరమొచ్చింది. మండలంలో అన్ని గ్రామాలు జ్వరాలతో వణికిపోతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలు, వాతావరణంలో మార్పులతో గిరిజన గ్రామాలు వైరల్ ఫీవర్లతో విలవిల్లాడుతున్నాయి. దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నారు. జ్వరంతో పాటు వాంతులు, విరోచనాలు, కాళ్లు, కీళ్ల నొప్పులు తదితర లక్షణాలతో మంచం పట్టారు. ప్రతీ ఇంట్లో ఇద్దరికి పైగా జ్వరపీడితులుగా ఉన్నారు. గర్జనపల్లిలో రెండు ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నా సిబ్బంది కొరత, ఆశల సమ్మెతో బాధితులకు సత్వర సేవలు అందడం లేదు. జ్వరంతో వచ్చిన వారికి అవసరమైన రక్త పరీక్షలకోసం శాంపిళ్లను ఎల్లారెడ్డిపేట, సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రులకు పంపిస్తున్నారు. మరికొంత మంది స్థానిక ఆర్ఎంపీ, పీఎంపీల వద్ద వైద్యం పొందుతుండగా.. ఆర్థికంగా జేబులు గుల్ల చేసుకుంటున్నారు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అర్ధరాత్రి.. బండరాయితో మోది


మృతుడి బంధువులతో మాట్లాడుతున్న డీఎస్పీ


అనుమానితుడి ఇంటి ఎదుట ఆందోళన

- చందుర్తిలో ఒకరి దారుణ హత్య
- బతుకుదెరువు కోసం వచ్చి విగతజీవిగా మారి
- పోలీసుల అదుపులో నిందితులు?


గంగారాం(ఫైల్)

చందుర్తి(వేములవాడ): చందుర్తిలో ఓ వలసకూలీ దారుణహత్యకు గురయ్యాడు. మంగళవారం అర్ధరాత్రి బండరాయితో మోది చంపేశారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా గుండారం గ్రామానికి చెందిన పులి గంగారాం(58) 25ఏళ్ల చందుర్తికి వలసవచ్చాడు. ఇక్కడే కుటుంబంతో ఉంటూ స్థిరనివాసం ఏర్పరుచుకున్నాడు. స్థానికంగా ఓ హోటల్‌లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం వినాయక నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్నాడు. రాత్రి గాంధీ విగ్రహం వద్ద ఓ షెట్టర్ ఎదుట నిద్రించాడు. వేకువజామున అటుగా వెళ్లిన గ్రామస్తులకు రక్తపుమడుగులో విగతజీవిగా కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై ఆశోక్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తలపై బండరాయితో కొట్టి చంపిన గాయాలు ఉన్నాయి. హత్య జరిగిన ప్రదేశానికి 100 మీటర్ల దూరంలో మురికికాలువలో బండరాయి కనిపించింది. వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి హత్య జరిగిన తీరును పరిశీలించారు. నిందితులను త్వరగా పట్టుకోవాలని గ్రామస్తులు డీఎస్పీని కోరారు. మృతుడి బంధువులు ఆందోళనకు సిద్ధం కాగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గంగారాంకు భార్య దేవవ్వ, కొడుకు శ్రీకాంత్, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. దేవవ్వ ఫిర్యాదు మేరకు సీఐ కిరణ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


గంగారాం మృతదేహం

పట్టించాడని.. పగ పెంచుకున్నాడా?

చందుర్తికి చెందిన ఓ బాలుడు(17) పక్షంరోజుల క్రితం మేకలు దొంగతనం చేశాడు. ఈ విషయాన్ని గంగారాం మేకల యజమానికి చెప్పాడు. ఆయన బాలుడిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. దీంతో బాలుడు గంగారాంపై కోపం పెంచుకున్నాడు. మంగళవారం అర్ధరాత్రి షెట్టర్ వద్ద నిద్రపోతున్న గంగారాం వద్దకు వచ్చిన బాలుడు గొడవపడి బండరాయితో హత్యచేశాడని స్థానికులు చర్చించుకుంటున్నారు. గంగారాంతో పాటు మరో నలుగురిని సైతం చంపేస్తానని, తనకు స్థానికంగా ప్రజాప్రతినిధుల అండ ఉందని సదరు బాలుడు ప్రచారం చేసుకుంటున్నాడని చెబుతున్నారు. అయితే సదరు బాలుడితో పాటు మరో ముగ్గురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. తమకు పరిహారం చెల్లించాలని మృతుడి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగగా పోలీసులు సర్దిచెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. ఎలాంటి అల్లర్లు జరగకుండా బందోబస్తు చేపట్టారు.

వ్యాసరచన పోటీల్లో రాణించిన విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): చదువుతో పాటు ఇతర సామాజిక అంశాలపై విద్యార్థులు దృష్టిసారించి ఉన్నతంగా రాణిస్తున్నారని డీఈవో ఏ.రమేశ్‌కుమార్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న మల్యాల అనుప్రభ, భారతం సాయికృష్ణ, ఎలుసాని మనూష వారధి ఫౌండేషన్ హైదరాబాద్ వారు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో రాష్ట్రస్థాయి బహుమతి సాధించారు. సర్టిఫికెట్లతో పాటు రూ. రూ.36వేల నగదు బహుమతి, ఏడాదిపాటు ఆన్‌లైన్‌లో స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ కోడ్ క్లాసలకు అర్హత సాధించారు. విద్యార్థులతో పాటు గైడ్ టీచర్ లింగాల రాజును ఎల్లారెడ్డిపేట ఎమ్మార్సీ కార్యాలయంలో బుధవారం డీఈవో అభినందించారు. సర్పంచ్ నిమ్మ లక్ష్మి, ఎంపీటీసీ అపెరా సుల్తానా, హెచ్ఎం చంద్రశేఖర్, ఎస్ఎంసీ చైర్మన్ గరిపెల్లి రమేశ్ ఉన్నారు.

గంజాయి స్వాధీనం.. ఒకరి అరెస్టు


నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని వట్టెంల శివారులో మందకృష్ణ అనేవ్యక్తి గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామానికి చెందిన మందకృష్ణ 100 గ్రాముల గంజాయిని తరలిస్తుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుపడ్డాడు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కృష్ణకుమార్, ఎస్ఐ మారుతి తెలిపారు. గంజాయి, మత్తు పదార్థాలు రవాణా చేసినా, విక్రయించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అన్నివర్గాల అభివృద్ధికి కృషి

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్
- కాంగ్రెస్ కరపత్రాల పంపిణీ


కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఆది శ్రీనివాస్

కోనరావుపేట: కాంగ్రెస్ పార్టీతోనే అన్నివర్గాల అభివృద్ధి జరిగిందని, మళ్లీ పార్టీ అధికారంలోకి వస్తేనే బడుగు బలహీనవర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేటలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రైతులకు, మహిళలతోపాటు అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎస్సీల రిజర్వేషన్లు 18శాతానికి పెంచుతామని, ఇల్లులేని వారికి ఇంటి నిర్మాణానికి రూ.6 లక్షలు అందిస్తామన్నారు. అంబేద్కర్ అభయహస్తం పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.12 లక్షల ఆర్థికసాయం అందిస్తామని అన్నారు. మహిళలకు రూ.500కే గ్యాస్ సిలిండర్, వృద్ధులకు రూ.4వేల పింఛన్, కౌలు రైతులకు, రైతులకు రూ.15వేల పెట్టుబడి సాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, జిల్లా కార్యదర్శి కచ్చకాయల ఎల్లయ్య, సాసాల మల్లారెడ్డి, మంగిలిపల్లి శంకర్, ప్రదీప్, ప్రభాకర్, నిత్యానందం ఉన్నారు.

విద్యార్థినితో లెక్చరర్ అసభ్య ప్రవర్తన

- కళాశాలలో చితకబాదిన విద్యార్థిని తల్లిదండ్రులు
- వివరణ ఇవ్వాలని లెక్చరర్‌కు ప్రిన్సిపాల్ నోటీసు


విద్యార్థిని కాళ్లు మొక్కుతున్న అధ్యాపకుడు

జగిత్యాలక్రైం: జగిత్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్న శ్రీనివాస్ అదే కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. విషయాన్ని ఆమె కుటుంబ సభ్యులకు తెలపడంతో విద్యార్థిని తల్లి కళాశాలకు చేరుకుని అధ్యాపకుడిని చితకబాదిన ఈ సంఘటన మంగళవారం చోటుచేసుకోగా.. ఆలస్యంగా వెలుగు చూసింది. చివరకు అధ్యాపకుడు విద్యార్థిని కాళ్లు పట్టుకుని క్షమాపణ కోరాడు. సంఘటనపై ప్రిన్సిపల్ సదరు అధ్యాపకుడికి వివరణ ఇవ్వాలని నోటీసు జారీ చేశారు.

అంతిమ యాత్రకు వైకుంఠ రథం కరువు


జీపులో మృతదేహాన్ని తరలిస్తున్న బంధువులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్‌కు చెందిన మోతె శ్రీనివాస్ గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన అంతిమ యాత్రకు వైకుంఠరథం కరువైంది. శ్రీనివాస్ మంగళవారం మృతి చెందగా అంత్యక్రియలకు వైకుంఠరథం కోసం ప్రయత్నించగా.. రెండు నెలలుగా మరమ్మతుకు గురైందని తెలిసింది. చేసేది లేక మృతదేహాన్ని జీపులో ఉంచి శ్మశాన వాటికకు తరలించారు. రెండు నెలలైన వైకుంఠరథాన్ని బాగు చేయించకపోవడంపై మాజీ సర్పంచ్ ఓరుగంటి తిరుపతి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్తాబాద్ శ్మశానవాటికలో సరైన వసతులు లేక మృతుల బంధువులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

రోడ్డెక్కిన ఆశాలు.. నినదించిన అంగన్‌వాడీలు



కలెక్టరేట్ ముట్టడించిన గ్రామ పంచాయతీ కార్మికులు


అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న ఆశాలు

- కలెక్టరేట్ ముట్టడించిన జీపీ కార్మికులు
- కాంగ్రెస్, ఏఐటీయూసీ నేతల సంఘీభావం

సిరిసిల్లటౌన్: జిల్లాకేంద్రంలో గ్రామ పంచాయతీ, మధ్యాహ్న భోజన కార్మికులు, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసనలు హోరెత్తించారు. తమ డిమాండ్ల సాధనకు చేపడుతున్న నిరవధిక సమ్మెల్లో నిరసనలతో హోరెత్తించారు. సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టగా.. కాంగ్రెస్ నేతలు సంఘీభావం తెలిపారు.

జీపీ కార్మికులను మోసం చేయొద్దు

జీపీ కార్మికుల డిమాండ్లు పరిష్కరిస్తామని మంత్రి ఎరబెల్లి దయాకర్‌రావు ఇచ్చిన మాట నిలపుకోవాలని జిల్లా గ్రామపంచాయతీ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి అన్నల్‌దాస్ గణేశ్ కోరారు. కార్మికుల సమస్యలను పరిష్కారం కోరుతూ..బుధవారం సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి మాట్లాడారు. జీపీ కార్మికుల న్యాయమైన కోరికలు పరిష్కరించకుంటే అసంఘటిత రంగాల కార్మికులను ఏకం చేసి పోరాటాలు చేపడుతామని హెచ్చరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య, సీఐటీయూ అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, మోర అజయ్, బూర శ్రీనివాస్, కృష్ణవేణి, మల్లయ్య పాల్గొన్నారు.

కనువిప్పు కలిగించాలి

తమ సమస్యలపై సర్కారుకు కనువిప్పు కలిగించాలని ఆశవర్కర్లు కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో వందలాది సంఖ్యలో పాల్గొనగా బుధవారం సిరిసిల్లలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. ఆశవర్కర్లకు ఫిక్స్‌డ్ జీతం నెలకు రూ.18వేలు అందించాలని డిమాండ్ చేశారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ సైతం ఆశవర్కర్ల సేవలు గుర్తించి ప్రశంసించగా సర్కారు మాత్రం పట్టింపు లేకుండా ఉండటం సరికాదన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, ఆశవర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బదవేణి మంజుల, ప్రధాన కార్యదర్శి జయశీల, చంద్రకళ, లత, రాణి, లావణ్య పాల్గొన్నారు.

మాట మార్చిన కేసీఆర్

తెలంగాణ వచ్చాక ధర్నాలు..నిరసనలు ఉండవని కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామన్న సీఎం కేసీఆర్ అధికారంలోకి రాగానే మాట మార్చారని కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి చీటి ఉమేశ్‌రావు విమర్శించారు. తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో అంగన్‌వాడీలు చేస్తున్న దీక్షలకు కాంగ్రెస్ నేతలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రచార కమిటీ రాష్ట్ర కన్వీనర్ అజ్మతుల్లాహుస్సేన్, పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, నాగుల సత్యనారాయణగౌడ్, సంగీతం శ్రీనివాస్, ఆకునూరి బాలరాజు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు, అంగన్‌వాడీ జేఏసీ జిల్లా అధ్యక్షురాలు కల్లూరి చందన, ప్రధాన కార్యదర్శి ఎదురుగట్ల మమత, కొండికొప్పుల పద్మ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.


అంగన్‌వాడీలకు సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలి

మధ్యాహ్న భోజన కార్మికులను పర్మినెంట్ చేయాలని చేస్తున్న దీక్ష ఎనిమిదోరోజు కొనసాగింది. పెండింగ్ బిల్లులు వెంటనే అందివ్వాలని వారు కోరారు. మధ్యాహ్న కార్మికుల సంఘం జిల్లా అ.ధ్యక్షుడు మీస లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎస్.లక్ష్మి, సత్తయ్య, సావిత్రి, మల్లవ్వ, నర్సయ్య, మంజుల, రేణుక, కనుకలక్ష్మి పాల్గొన్నారు.

30 మందిపై కేసు

సారంగాపూర్: మండలంలోని పోతారం శివారు గణేశ్‌పల్లిలో రెండువర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నాయి. రెండు వర్గాల్లోని 30 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. పాత కక్షలు మనసులో పెట్టుకుని మంగళవారం రాత్రి ఒక వర్గంపై మరో వర్గం వారు దాడి చేసుకున్నారు. ఇందులో ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. మి గిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. ఇరువర్గాలూ ఫిర్యాదు చేసుకోవడంతో ఒక వర్గంలోని 15 మంది, మరో వర్గంలోని 15 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భూషణరావుపేటలో చోరీ

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో వేర్వేరు చోట్ల దొంగతనాలు చోటుచేసుకున్నాయని గ్రామస్తులు తెలిపారు. రాపెల్లి వేమయ్యకు చెందిన పాన్ టేలను మంగళవా రం అర్ధరాత్రి దాటాక గుర్తు తెలియని దొంగలు ధ్వంసం చేసి అందులోని రూ.5 వేలు, ఇత ర వస్తువులు ఎత్తుకెళ్లారు. దేవ అంజయ్యకు చెందిన వ్యవసాయ మోటార్‌ను ఎత్తుకెళ్లారు.

గుండెపోటుతో ఒకరి మృతి


పవన్ (ఫైల్)

మల్లాపూర్: మండలంలోని చిట్టాపూర్‌కు చెందిన ఒకరు హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బక్కూరి సత్యనారాయణ, లక్ష్మీ దంపతులకు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు బక్కూరి పవన్ (37) సంతానం. పవన్ కొద్దిరోజులుగా భార్య పూజిత, కుమారుడుతో కలిసి హైదరాబాద్‌లోని గోల్నాకలో నివాసముంటున్నాడు. బుధవారం పవన్‌కు గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగానే పరిస్థితి విషమించి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆయన స్వగ్రామంలోని తల్లిదండ్రులు, బంధువులు బోరున విలపించారు.

పెద్దమ్మ, ఎల్లమ్మ ఆలయాల్లో చోరీ

మల్లాపూర్: మండలంలోని వాల్గొండలో పెద్దమ్మ, రేణుక ఎల్లమ్మ ఆలయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు తెలిసింది. ఆలయాల్లో కొంతకాలం క్రితం ఉత్సవాలతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులు తమ కానుకలు హుండీలో వేసి మొక్కులు చెల్లించుకుంటున్నారు. బుధవారం ఆ ఆలయాల్లోకి స్థానికులు వెళ్లగా అమ్మవారల ముక్కు పుడకలు, పుస్తెలు (రెండున్నర తులాలు), ఏడు తులాల వెండి ఆభరణాలు (కడియం, మెడలో చైన్) కనిపించలేదు. గ్రామస్థులు స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడంతో వారు ఆలయానికి చేరుకుని పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఎస్సై నవీన్‌కుమార్‌కు సమాచారం అందించారు.

వలస వచ్చి.. విగతజీవిగా మారి

- చందాలతో స్వస్థలానికి పంపిన వైనం


గర్దాస్ కృష్ణ మృతదేహం

సిరిసిల్లటౌన్: వలసవచ్చిన నిరుపేద నేతకారుడు అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. చేతిలో చిల్లిగవ్వలేని ఆ కుటుంబానికి సిరిసిల్లలోని మానవతావాదులు చేదోడుగా నిలిచారు. స్థానికుల వివరాల ప్రకారం మహారాష్ట్ర భీవండికి చెందిన గర్దాస్ కృష్ణ(39) పదకొండు నెలల క్రితం సిరిసిల్లకు వచ్చి అంబికానగర్‌లో అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. సాంచాలు నడుపుతూ భార్య పుష్ప, ఎనిమిదేళ్ల కొడుకును పోషిస్తున్నాడు. కొన్నాళ్లుగా మూర్ఛవ్యాధితో బాధపడుతున్నాడు. బుధవారం ఉదయం మూర్ఛరావడంతో జిల్లాసుపత్రికి భార్య తరలించింది. ఈసీజీ తీస్తున్న సమయంలో గుండెపోటుతో మృతిచెందాడు. చేతిలో చిల్లిగవ్వ లేని నిస్సహాయ స్థితిలో భార్య, పిల్లలను చూసి బీజేపీ నేతలైన మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, ఉపాధ్యక్షుడు శీలం రాజు, గాజుల వేణు, రాజు తదితరులు చందాలు పోగు చేశారు. రూ.39వేలతో అంబులెన్స్ మాట్లాడి సొంతగ్రామానికి పంపించారు.


అంబులెన్స్ ఖర్చులు అందిస్తున్న ఆడెపు రవీందర్